

# తాడిని తన్నేవాడుంటే?

రావినూతల సువర్ణాకన్నన్

ఎండ!

నిప్పులు చెరుగుతున్న ఎండ!

నెత్తిమీదున్న టోపీ కాలిన పెనంలా అనిపించింది ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటసామికి.

కడుపులో పేగులు నకనకలాడుతున్నాయి.

వాచ్ చూసుకున్నాడు.

ఒంటిగంట దాటింది.

ఎప్పుడూ నిండుగా కళకళలాడుతూ వుండే అతని జేబులు వెలవెలపోతున్నాయి. అతనిలో చిరాకు పెరిగిపోతోంది.

అది ఆకలివల్లా కాదు, ఎండవల్లా కాదు.

జేబులు నిండకపోవడమే!

జేబుల్లో నోట్లు పడందే ఓసీ భోజనం, ఏసీలో చేసినా ముద్ద మింగుడు పడదతనికి.

"ఛ! ఇవాళ పొద్దున్నే ఎవరి మొహం చూశానో గానీ అన్నీ చావు బేరాలే! తాను వల విసిరి పట్టుకున్న నలుగురైదుగురూ 'ప్రెస్సూ గిస్సూ' అంటూ కస్సుమని ఇంతెత్తున లేచి, తనని కొట్టినంత పని చేసి మరీ దూసుకుపోయారు. అసలు ఎవరు ప్రెస్సో, ఎవరు గిస్సో తెలిసిచావడం లేదు! పది రూపాయలు పారేస్తే ప్రెస్ స్టిక్కర్ వచ్చేస్తుంది. పోనీ అలా అనుమానించి డబాయిస్తే వాడు నిజంగా ప్రెస్సే అయ్యాడా తన పని గోవిందా! ఏవిటో రోజులు మరీ పాడయిపోయాయి" అనుకున్నాడు భారంగా.

"బలవంతుడు బలహీనుణ్ని, నోరుగలవాడు నోరు లేనివాణ్ణీ దోచుకుతినడమే యుగధర్మం! కలియుగధర్మం" అని తన పైవాళ్ళని మనసులోనే తిట్టుకోవడం ప్రస్తుతం అతనికి గుర్తులేదు.

ఆ సమయంలోనూ వాహన దారుల్ని గమనించడం మాన లేదు. నీరసం మరింత పెరిగిపోతోంది. ఒళ్ళంతా నిస్సత్తువ ఆవరించేసింది.

"ఒంట్లోని రక్తమంతా నీళ్ళలా మారిపోయినట్టుంది" అని ఎవరో రచయిత్రి రాసిన వాక్యం గుర్తొచ్చి భారంగా నిట్టూర్చాడు.

హఠాత్తుగా అతని కళ్ళు తళుక్కుమన్నాయి. ఏనుగు బలం వచ్చినట్టయింది.

కారణం దూరంగా ఓ కెనెటిక్ హోండా వేగంగా రావడమే.

'అయితే ఏవిట్ట?' అనుకోకండి. ఆ హోండా మీద వస్తున్న యువకుడి తలమీద హెల్మెట్ లేదు!

"ఏయ్! ఆపు! ... నిన్నే! స్టాపూ" అని అరుస్తూ దాదాపు స్కూటర్ కింద పడినంత హడావిడి చేశాడు వెంకటస్వామి.

బైకు ఆగింది.

"హెల్మెట్ లేదేం" దబాయించాడు వెంకటసామి.

"లేదు సార్! అయినా ట్రావెల్ చేసేవాళ్ళలో నైంటీ పర్సంట్ వాళ్ళకి హెల్మెట్స్ లేవుకదండీ!"

"అది మా డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఆలోచించాల్సిన విషయం. నీకుందా? ముందది చెప్పు!"

"చూశారుగా! లేదు సార్" మర్యాదగానే అన్నాడు.

"హెల్మెట్ లేకుండా స్కూటర్ నడపడం తప్పు కదా?"

"తప్పే సార్! ఈసారి తప్పకుండా హెల్మెట్ పెట్టుకునే వస్తాను."

"గొప్ప పని చేశావ్! పోనీ... నీ లైసెన్స్ చూపించు!" మనసులోనే అతని దగ్గర ఎంత వసూలు చెయ్యాలో అంచనా వేస్తూ అన్నాడు వెంకటస్వామి.

"లైసెన్సా? వెరీ సారీ సార్! అది ఇంటి దగ్గర మర్చిపోయాను" గొణిగాడు యువకుడు.

"వ్వాట్? ఇంటి దగ్గర మర్చిపోయావా? ఇంట్లో లైసెన్స్, రోడ్డుమీద డ్రైవింగ్.... అంటే రెండు తప్పులు! నెంబర్ త్రీ... కనీసం ఆర్సీ బుక్కయినా చూపించు!" అరిచాడు వెంకటసామి.


"అదీ లేదండీ" చేతులు కట్టుకుని దీనంగా అన్నాడా యువకుడు.

కెవ్వుమన్నంత పని చేశాడు వెంకటసామి.

"ఆర్సీ బుక్ లేదా! అదెక్కడ దాచావ్"అన్నాడు వ్యంగ్యంగా. తన రాబడి పెరిగిపోతుందన్న ఆనందాన్ని దాచుకుంటూ.

"తాకట్టు పెట్టాను"

"వెరీగుడ్! మంచి పౌరుడివి. కానీ ఇది మరో




అపరాధం. తెలుసా?"

"తెలుస్సార్!"

"మరెందుకు తాకట్టు పెట్టావ్?"

"ఏంటి సార్! మరీ అమాయకంగా మాట్లాడతారు? డబ్బవసరం అయితే తాకట్టు లేకుండా ఇచ్చే దానకర్ణులు ఎవరుంటారు? డబ్బవసరం అయింది" రవంత చిరాగ్గా అన్నాడతను.

అతని లాజిక్కుకి ఒళ్ళు మండిపోయింది వెంకటసామికి.

"భాష! భాష! ఏవిటి దబాయించి మరీ మాట్లాడుతున్నావ్? అసలు నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" హోమ్ మినిస్టర్ లెవెల్లో అడిగాడు వెంకటసామి.

"అయ్యా ఆస్తిపాస్తులున్నవి అవసరానికి తాకట్టుపెట్టుకోవడానికి అని తెలియని మీకెవరిచ్చారండీ ఈ ఉద్యోగం. అసలు అబద్ధం చెప్పకుండా నిజం చెప్పినందుకు మీరు నన్నభినందించాలి" అదోలా నవ్వుతూ అన్నాడా యువకుడు.

అతని నవ్వుకి వెంకటసామి మొహం కోపంతో కందగడ్డయిపోయింది.

"నీ పాపం పండింది" అన్నాడు అరిచినట్టు.

"అందుకే మీ చేతుల్లో పడ్డాను."

"నా చేతుల్లో కాదు. నీకభినందనలు చెప్పి, సన్మానించాలి. పద!"

"ఎక్కడికి?" అమాయకంగా అన్నాడా యువకుడు.

"ఇంకెక్కడికి... పోలీస్టేషన్‌కి!"

యువకుడు రవంత కంగారుపడ్డాడు.

"ఇంతోటిదానికి స్టేషన్ దాకా ఎందుకు సార్. ఇదిగో! నాతో పెట్టుకుని చాలా టైమ్ వేస్ట్ చేశారు. ఓసారటు చూడండి. ఎంతమంది హెల్మెట్లు లేకుండా దూసుకుపోతున్నారో. వాళ్ళనాపుంటే ఈపాటికి మీ జేబులు నిండేవి. నా మాట విని నన్నొదిలెయ్యండి సార్" అన్నాడు కాళ్ళబేరాని కొస్తూ.

"నిజమే" అనిపించింది వెంకటసామికి.

"ఓకే! డబ్బు తియ్యి!" అన్నాడు వెంకటసామికి.

"తప్పుతుందా" అంటూ జేబులోంచి ఓ వంద నోటు తీసి వెంకటసామి చేతిలో పెట్టాడతను.

వెంకటసామి కళ్ళు ఎర్రబడ్డాయి.

"వందా! దేనికి?" అన్నాడు తీక్షణంగా.

"అవసరానికొస్తుంది. వుంచండి సార్!" నవ్వాడతను.

"దీసీజ్ టూమచ్! పోలీసులకి లంచం ఇవ్వాలని చూస్తున్నావా? ఇది మరీ నేరం! నాక్కావల్సింది లంచం కాదు. జరిమానా! నువ్వు హెల్మెట్ పెట్టుకోలేదు. దానికి మూడొందలు. లైసెన్స్ లేదు. మూడొందలు. ఆర్సీబుక్ లేదు. మరో మూడొందలు. నాకు లంచం ఇవ్వాలని చూశావ్... దానికి...."

"మరో మూడొందలు" అతని మాట పూర్తి కాకుండానే అన్నాడు యువకుడు.

"అంతేకాదు. అసలది దొంగ వెహికిల్ కాదని నమ్మకం ఏమిటి? దానికి జైలు శిక్షే పడచ్చు" అరిచినట్టు అన్నాడు వెంకటసామి.

"అయితే నన్నేం చెయ్యమంటారండీ?" నిస్సహాయంగా అన్నాడు.

"పన్నెండొందలు తియ్యి!"

"అంత డబ్బు నా దగ్గర లేదండీ బాబూ! కావాలంటే మరో వంద తీసుకోండి!"

"అదిగో మళ్ళీ లంచం! నేను వంద, రెండొందలకి కక్కుర్తిపడేవాడిలా కనిపిస్తున్నానా!" కళ్ళెర్రచేశాడు వెంకటసామి.

"ఎంతమాట? తమరు వేలు తీసుకునేవారిలా కనిపిస్తున్నారు. కానీ నా దగ్గర అంత డబ్బు లేదండీ!"

"ఇదిగో! నా దగ్గర ఇలా ఎక్స్ట్రాలు పోయావంటే రేటు పెరిగిపోతుంది" కస్సుమన్నాడు వెంకటసామి.

'అయ్యో! నా దగ్గర మూడొందలకన్నా లేదు మహానుభావా! ఈ మూడొందలూ తీసుకుని ముద్దుగా నన్ను వదిలెయ్యండి'' కాళ్ళ బేరానికొచ్చాడు.

''ఏవిటి... ఇన్ని తప్పులకి మూడొందలా! నీ కంటికి నేనో వెర్రి వెధవలా కనిపిస్తున్నానా? నీ దగ్గర లంచం తీసుకునేంత చీప్ మెంటాలిటీగాణ్ణనుకున్నావా?'' ఆవేశంతో వెంకటసామి మాట తడబడింది.

''మరి ఇందాకట్నించీ చేస్తున్న పని అదేగా?'' కాస్త వ్యంగ్యంగా అన్నాడు యువకుడు.

వెంకటసామి ఆగ్రహం అంచులు దాటింది.

''పద పోలీస్టేషన్‌కి'' అంటూ అతని రెక్క పట్టుకున్నాడు.

''మళ్ళీ అదేమిటి?'' చెయ్యి విదిలించుకుంటూ అన్నాడా యువకుడు.

''ఇది మామూలు కేసుకాదు. దారుణమైన స్పెషల్ కేసు. ఇది పై ఆఫీసర్లు డీల్ చెయ్యాల్సిందే. వాళ్ళు వేలు వదిలిస్తేగానీ నీ రోగం కుదరదు! పద!''

''అంతదాకా ఎందుకండీ. పోనీ ఇంకో రెండొందలు తీసుకోండి!''

''ఏమిటీ! కూరగాయల బేరమాడుతున్నావా! అదంతా జాంతానై!''

''పోనీ మీ మనసులో ఏం వుందో చెప్పండి'' దీనంగా అన్నాడా యువకుడు.

క్షణం ఆలోచించి – ''ఓ! కే! నువ్వంతగా బతిమాలుతున్నావ్ కాబట్టి నాకూ కాస్త పట్టూవిడుపూ వుండాలి. అందుకే ఓ వెయ్యి ఇచ్చి నీ దారిన నువ్వు పో!'' జాలి నటిస్తూ అన్నాడు వెంకటసామి.

''వెయ్యా!?''

''ఏమిటయ్యా. అలా నోరెళ్ళబెట్టావ్! నేను కాబట్టి ఆ మాత్రం జాలి చూపించాను. అదే పైదాకా వెళ్తే...'' నవ్వాడు వెంకటసామి.

''తప్పదా!'' దీనంగా అన్నాడా యువకుడు.

''తప్పదు. తొందరగా ఇచ్చిపో! అవతల ట్రాఫిక్ పెరుగుతోంది!'' తొందరపెట్టాడు వెంకటసామి.

ఆలోచనలో పడ్డాడు యువకుడు.

''ఇంకా ఆలోచిస్తారేంటి సార్! మా వెంకటసామి సారిది చాలా జాలిగుండె. కాబట్టే ఓ వెయ్యితో వదిలారు. తొందరగా ఇచ్చెయ్యండి''. కాస్త దూరంగా నిల్చున్న ఓ మాసిన గడ్డపతను గుసగుసగా అన్నాడు.

''నువ్వెవరు! నీ స్కూటరేది?'' అనుమానంగా అతన్ని చూస్తూ అడిగాడు వెంకటసామి. తన పేరు వాడికెలా తెలిసిందా అని ఆలోచిస్తూనే.

అతను హడలిపోతూ –

''అయ్యబాబోయ్! నాకు స్కూటర్ కాదు కదా, డొక్కు సైకిలు కూడా లేదు సార్. అక్కడక్కడ చిత్తుకాయితాలేరుకుంటూ వుంటాను. మిమ్మల్ని శానా సార్లు చూశాను. అందుకే ఈయనకి చెప్పాను'' అన్నాడు భుజాన వున్న చిన్న గోనెసంచీ సర్దుకుంటూ.

''ఊc! తొందరగా తియ్యి!'' మెల్లగా అన్నాడు వెంకటసామి.

తప్పనిసరిగా జేబులోంచి వెయ్యి రూపాయల నోటు తీసి వెంకటసామికి అందించాడు యువకుడు.

వెంకటసామేం సిగ్గుపడలేదు. ఆ కొత్త నోటుని అటూఇటూ తిప్పి చూసుకుంటూ, యువకుడికి షేక్‌హేండిచ్చి – ''ఇంకనుంచీ జాగ్రత్తగా వుండు'' అంటూ ఓ ఉచిత సలహా పారేసి క్షణం కొయ్యబారిపోయాడు.

ఇందాక చిత్తుకాయితాలేరుకుంటానన్న గడ్డం యువకుడి చేతిలో వీడియో కెమెరా, ఖరీదైన విదేశీ కెమెరా వున్నాయి వాళ్ళని షూట్ చేస్తూ.

తన బేరసారాల్లోనూ, ఎండవల్లా తమని తమ చర్యల్ని రికార్డు చేస్తున్నారన్న సంగతే తెలియలేదతనికి.


''వాటీజ్ దిస్?'' అన్నాడు అరిచినట్టు.

''ఏం లేదు సార్! ఆ వీడియో వగైరాలు తీసింది, మన మాటలన్నీ రికార్డు చేసిందీ... మా బ్రదరే'' పెద్దగా నవ్వాడా యువకుడు.

వెంకటసామి మొహంలో ప్రాణభయం లాంటిది చోటుచేసుకుంది.

''మనల్ని రికార్డు చెయ్యడం ఎందుకు?'' అన్నాడు చెమటలు తుడుచుకుంటూ వెంకటసామి.


''ఇంకెందుకూ. తమ బండారం బైటపెట్టడా





కాకతీయ గడపలో కాలు పెట్టండి.
మీ గృహానికి కళ్యాణతోరణం కట్టండి.

ఆకుపచ్చని తోరణం... పసుపు పచ్చని గడప... 'కాకతీయ' తెచ్చిన పెళ్ళి మండపం... 3 దశాబ్దాలుగా... 4 రాష్ట్రాల్లో.... 30 నగరాలలో.... చక్కని పెళ్లికి.... చిరకాల అనుబంధానికి... కాకతీయ మ్యారేజెస్ ప్రైవేట్ లిమిటెడ్. నేడే మీ సమీప బ్రాంచ్‌ను సందర్శించండి. మీ కలల భాగస్వామిని కలుసుకోండి.


శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచిలి

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999


FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

www.kaakateeya.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | తాంబరం | 093400 99993 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | బెంగుళూరు | 093429 39345 |
| విజయవాడ | 093922 92939 | జయానగర్ | 093429 39343 |
| గుంటూరు | 098485 35375 | మైసూరు | 093429 39342 |
| తెనాలి | 098480 31931 | కోయంబత్తూరు | 093457 94668 |
| విశాఖపట్నం | 098481 63833 | సేలం | 093855 99066 |
| రాజమండ్రి | 098485 35377 | మధురై | 093603 35233 |
| కాకినాడ | 098483 37378 | వెల్లూర్ | 093449 94400 |
| ఖమ్మం | 093470 59988 | తిరుచి | 098428 01111 |
| ఒంగోలు | 098487 11223 | పాండిచ్చేరి | 098421 27777 |
| నెల్లూరు | 098481 97222 | ఈరోడ్ | 093855 99011 |
| తిరుపతి | 098485 35378 | అనంతపూర్ | 093460 09348 |
| కర్నూల్ | 093900 33815 | | |




నికి!'' వ్యంగ్యంగా అన్నాడా యువకుడు.

''మీరు ప్రెస్సా!'' వెంకటసామికి కళ్ళు తిరుగుతున్నాయి.

''ఎస్!''

''అబద్ధం! ప్రెస్ అయితే ప్రెస్ బోర్డు పెట్టుకోలేదేం?'' ధైర్యం తెచ్చుకుంటూ అన్నాడు వెంకటసామి.

''ప్రెస్ అని రాసుంటే ... మన మధ్య ఇంత కథ జరిగేదా! మీకు కేసులు కావాలి. మాకు న్యూస్‌లు కావాలి. మీ గురించి తెలిసే ఈ నాటకం ఆడాం.''

''ఇది అన్యాయం! దారుణం! ఘోరం!''

''ఆ డైలాగ్స్ నావి. ఇప్పుడు చెప్తున్నా విను! సాయంత్రం తాజా న్యూస్‌లో చూడు. నీ అందమైన ఫోటో, లంచం తీసుకుంటున్న నీ అమృత హస్తాలు దర్శనం ఇస్తాయి. లేకపోతే నా దగ్గరే లంచం తీసుకుంటావా. చూస్తాను'' బైక్ స్టార్ట్ చేస్తూ అన్నాడా యువకుడు.

మూర్ఛరోగి పడినట్టు దభీమని బైక్‌ముందు పడిపోయాడు వెంకటసామి.

''సార్! మనం మనం కావల్సినవాళ్ళం. మీరు మాకూ, మేం మీకూ సహాయపడుతూ వుండాలే గానీ , ఇలా జీవితాలతో ఆడుకోవచ్చా? నాది పొరపాటే. ఇదిగో. మీ వెయ్యి తీసుకోండి'' బలవంతంగా ఆ యువకుడి చేతుల్లో వెయ్యి నోటు కుక్కాడు.

యువకుడి మొహం సీరియస్‌గా అయిపోయింది.

''ఇదేంటి వెయ్యిచ్చావ్? నేనిచ్చింది మూడు కేసులకీ మూడు వేలు కదా!'' అన్నాడు కొట్టినట్టు.

వెంకటసామి హడలిపోయాడు.

''సార్! మీకు నాతో పరిహాసాలేంటి. మీరిచ్చింది వెయ్యే కదా! ఈ వెయ్యి తీసుకుని నన్నొదిలెయ్యండి. ప్లీజ్!'' దాదాపు కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు.

అయినా యువకుడు కరగలేదు.

''చూడు మిస్టర్! మర్యాదగా మూడువేలూ ఇవ్వు! కాదంటావా సాయంత్రం న్యూస్ తర్వాత మాట్లాడుకుందాం'' అన్నాడు బైక్ స్టార్ట్‌చేస్తూ.

''బాబ్బాబు! అంతమాటనకండి. పిల్లలు గల వాణ్ణి. పోనీ మరో ముక్క చెప్పండి'' కళ్ళనిండా గ్లిజరిన్ పెట్టినంతగా కన్నీళ్ళొచ్చేశాయి వెంకటసామికి.

''ముక్కల్లేవు. చెక్కల్లేవు. మూడువేలకి పైసా తగ్గే ప్రసక్తిలేదు. ముందు తప్పుకో'' కఠినంగా అన్నాడా యువకుడు.

''మూడు వేలెక్కణ్ణించి తేను సార్!''

''నీకూ మూడువేలో లెక్కా! నీ ఒక్కరోజు సంపాదన!''

''నా బొంద! అంత సంపాదనే వుంటే, ఇంత ఎండలో ఒరుగులా ఎందుకు ఎండిపోతాను. వానాకాలంలో ఒణుక్కుంటూ ఎందుకు నిల్చుంటాను! అంతెందుకు. ఇవాళ నా కర్మేంటోగానీ పట్టుమని రెండొందలు కూడా దొరకలేదు'' కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు వెంకటసామి.

క్షణం ఆలోచించాడు యువకుడు.

''అయితే నీ దగ్గర డబ్బు లేదంటావ్?'' అన్నాడు మెల్లగా.

''నిజం సార్! మీ మీదొట్టు'' రవంత ఆశ వూపిరి పోసుకుంది వెంకటసామిలో.

''పోనీ ఓ పన్చెయ్యి'' అన్నాడా యువకుడు.

''చెప్పండి సార్. మీ ఇంటికి తెచ్చివ్వనా! అడ్రస్ చెప్పండి. రెండువేలూ పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను'' ఉత్సాహంగా అన్నాడు వెంకటసామి.

యువకుడు పడిపడి నవ్వాడు.

''చూడు వెంకటసామీ! నేనంత బతిమాలినా నన్నొదిలావా! నేను మాత్రం ఎలా వదుల్తాను. అయినా అడ్డమైన వాళ్ళకీ నా పేరు, అడ్రస్ చెప్పి కొరివితో తల గోక్కోవడం నాకిష్టం వుండదు. అందుకే ఓ సలహా ఇస్తాను. అలా చెయ్యి! నీ న్యూసూ రాదు. నీ ఉద్యోగానికీ ఎసర్రాదు'' అన్నాడు అనునయంగా.

''చెప్పండి!'' నీరసంగా అన్నాడు వెంకటసామి.

''నీ వేలికున్న వుంగరం ఇచ్చెయ్యి!''

''ఏమిటి! ఇది తులం ఉంగరం. అదిగాక ఇది మా అత్తగారు పెళ్ళిలో నాకిచ్చింది'' కంగారుగా అన్నాడు వెంకటసామి.

''సరే. రేపు ఓ అరలక్ష ఖర్చు పెట్టుకుని ఉద్యోగం నిలుపుకో. ఈ న్యూస్ ఇపుడే స్టూడియో వాళ్ళకి అందజేస్తాం. దీన్ని కంప్యూటర్లో ఫీడ్ చేశాక ఆ దేవుడు కూడా నిన్ను రక్షించలేడు. మరి వస్తా. తర్వాత కలుద్దాం!'' నిర్మొహమాటంగా అన్నాడా యువకుడు.

వెంకటసామికి దుఃఖం వచ్చేసింది. కానీ తప్పదు. ఏడుస్తూనే వేలికున్న తులం ఉంగరం అతి ప్రయాసగా తీసి యువకుడి చేతిలో పెట్టాడు.

దూరంనుంచీ ఎవరో కెమెరా క్లిక్ చేసినట్టనిపించి తుళ్ళిపడి చూశారు యువకుడు, వెంకటసామి కూడా.

ప్రతివాడికీ ఈ కెమెరా పిచ్చి పట్టుకుంది! ఎవరో కాలేజీ స్టూడెంటు అందమైన అమ్మాయిల్ని ఫోటోలు తియ్యడం అతను చాలాసార్లు చూశాడు. అందుకే అంతగా పట్టించుకోలేదు. యువకుడు మాత్రం మాటమాత్రం వెంకటసామితో చెప్పకుండానే పక్కనున్న గడ్డపాణ్ణి ఎక్కించుకుని క్షణాల్లో కనుమరుగైపోయాడు.

ఉసూరుమంటూ ఇల్లు చేరిన వెంకటసామి తిండి కూడా తినకుండా మంచంమీద వాలిపోయాడు. ఉంగరం సంగతి తెలుసుకున్న పెళ్ళాం మాత్రం తిట్లతో అతని కడుపు నింపేసింది.

కిమ్మనలేదతను.

అతనికి ఇంకా అనుమానమే. సాయంత్రం తన న్యూస్ ఎక్కడొస్తుందో అని. మళ్ళీ –

'ఉంగరం తీసుకున్నాడుగా. ఇంక ఆ న్యూస్ ఇవ్వళ్ళే' అని తనకి తానే ధైర్యం చెప్పుకుంటూ టి.వి. ముందు కూర్చున్నాడు.

సాయంత్రం ఆరు గంటలకి న్యూస్ చూశాడు.

అంతే కొయ్యబారిపోయాడు.

ఆ న్యూస్‌లో –

''పాసింజర్‌ని మోసం చేయబోయిన పోలీసును మీడియా ముసుగులోని ఇద్దరు మోసగాళ్ళు అతని చేతికున్న తులం బంగారు ఉంగరం కాజేసిన వైనం'' అంటూ ఫోటోలతో సహా భావయుక్తంగా బేస్ గొంతుతో వివరించాడు న్యూస్‌రీడర్.

జరిగింది పూర్తిగా అర్థమైన వెంకటసామికి, చెమటలు పట్టాయి. టి.వి. పగలగొట్టెయ్యాలన్నంత ఆగ్రహం వచ్చింది. కానీ అసలే తులం బంగారు ఉంగరం పోయింది. దానికితోడు కొత్త కలర్ టి.వి. మరో టి.వి. కొనాలంటే ఎన్ని కేసులు బుక్ చెయ్యాలి? ఎంతమందిని డబాయించాలి. మధ్యమధ్య ఇలాంటి దొంగవెధవల పాలపడితే బతుకే బండలవుతుంది – అనుకున్న అతను టి.వి. జోలికి పోకుండా పళ్ళు నూరుకున్నాడు.

★